టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేపీ మురళీకృష్ణ తదితరులు

నల్లకుంట. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీకృష్ణ కలిసి శాలువతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు జర్నలిస్టు నేలాంటి మధు రాసిన 'రాజకీయ వృత్తి-నాయకత్వం-ఉద్యోగం, ఉపాధి అవకాశాలు' అనే పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

అంజన్‌కుమార్ యాదవ్‌కు ...



అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గుండు జగదీశ్‌బాబు తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్‌బాబు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఇందిరాపార్కు ఎన్టీఆర్ స్టేడియం వద్ద సదర్ ఉత్సవాలు విజయవంతం కావడంలో అంజన్న పాత్ర ఎంతో ఉందని ఆయనను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాశం అనిల్‌యాదవ్, శీలం సత్యనారాయణ, సురేష్‌యాదవ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకమాస పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ అంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాస పవిత్రోత్సవాలు శనివారం నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈఓ మాచర్ల దేవనాథం తెలిపారు. 13న బిలుకు ద్వాదశి, తులసీ కృష్ణ కల్యాణం, 15న ఉదయం 11 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సాయంత్రం 7 గంటలకు జ్వాలాతోరణం, 29న మాసశివరాత్రి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని భక్తులు ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఉద్యమకారుల గర్జన'ను విజయవంతం చేయాలి

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 3న హనుమకొండ జిల్లా కేంద్రం పబ్లిక్‌గార్డెన్‌లోని వేణుమాధవ్ ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆకాంక్షల వేదిక రాష్ట్ర కార్యవర్గం పక్షాన ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్రప్రాంతాన్ని తెలంగాణలో కలిపిన నాటినుంచి 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు తెలంగాణ ప్రాంతంలో జరిగిన దోపిడీ, అణిచివేతలపై పోరాటం చేసిన ఉద్యమకారులను, ఉద్యమ కుటుంబలను గుర్తించి అన్ని విధాల న్యాయం చేయాలని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు అన్ని విధాలా సహాయం అందించాలన్నారు. సభకు టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రొ.కూరపాటి వెంకటనారాయణ తదితర ప్రముఖులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములుకండి

● ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, బీఆర్ఎస్ నాయకుడు బి.వినోద్‌కుమార్, టీడీపీ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం నేతలను డాక్టర్ దిడ్డి సుధాకర్ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహిస్తున్న సమావేశానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ఈ నెల 4వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొని తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. సమావేశానికి అఖిలపక్ష నేతలతో పాటు మేధావులు ,ఉద్యమకారులు హాజరవుతారని తెలిపారు.

మాలల హక్కులను హరించాలని చూస్తే
ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదు

● వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ చైర్మన్ శ్రీధరరావు

నవంబర్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా దళిత సంఘాలు సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు మాలల హక్కులను హరించాలని చూస్తే తిరుగుబాటు తీవ్ర రూపం దాల్చక తప్పదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం హైదర్‌గూడలో కమిటీ చైర్మన్ పి.బల్వంత్‌రావు, వైస్ చైర్మన్ తాలుకా రాజేష్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో ఎక్కువ లబ్ధిదారులు ఎవరో గుర్తించకుండా, వర్గీకరణ చేస్తే ఈ ప్రభుత్వాలకు మాలలచే తిరుగుబాటు తప్పదన్నారు. గత మూడు దశాబ్దాలలో మాలల మౌనం వల్ల అన్ని రంగాల్లో ఆర్థిక నష్టాన్ని మిగిల్చిందని వాపోయారు. ఈ నేపథ్యంలో మాలల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు కాపాడడానికే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆవిర్భావించిందన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, చిన్నారులు తదితరులు

కవాడిగూడ, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఐక్యమత్యమే మహాబలమని సర్దార్ వల్లభాయ్ పటేల్ నిరూపించారని. ఐకమత్యంతో సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నోపద్మాకమలాకర్ అన్నారు. డాక్టర్ హిప్నోపద్మాకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రామకృష్ణమఠంలోని బాలల సేవా విభాగంలో రఘునందన్ మహారాజు సహకారంతో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి యోగాగురువు సరోజినీ రామారావు, శోభారాణి, జ్యోతిరాజా, జయశ్రీ, పూర్ణ, ఆరతి, లక్ష్మీ, డాక్టర్ హిప్నోపద్మాకమలాకర్ బహుమతులు, పుస్తకాలు, బాణసంచా అందజేశారు.

టీటీడీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ జువెలరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణ, హైకోర్టు న్యాయవాది గోవింద్‌రావు, రిటైర్డ్ ఏసీపీ నారాయణగౌడ్, మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ జగదీష్ తదితరులు -(రాంనగర్, ఆంధ్రజ్యోతి)

ఆనందోత్సాహాలతో దీపావళి

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి టపాసులు కాల్చారు. దీపావళి సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను కలిసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. (ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ల బృందం)



ముషీరాబాద్‌లో బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శివముదిరాజ్



శివాలయం వీధిలో కుటుంబసభ్యులతో టపాసులు కాలుస్తున్న బీఆర్ఎస్ నేత శ్రీధర్‌చారి తదితరులు



కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి బాణసంచా కాలుస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ తదితరులు

పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరా బాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ముఖ్యఅతిథిగా హాజరై లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశా రు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదా, పార్టీ నా యకులు ఎండీ మోహిన్, వీరేష్, శ్రీనివాస్, రాజు, హేమచంద్రధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు



సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్‌యాదవును కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు అల్లాక్ హుస్సేన్, మహ్మద్ అలీ



మాజీమంత్రి హరీశ్‌రావుకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు



ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్, బీజేపీ నగర నాయకుడు అడపా చంద్రమౌళి, బీజేపీ నాయకులు అడపా జనార్దన్ తదితరులు



పద్మశాలి కాలనీలో బొమ్మల కొలువులో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న పద్మశాలీ సంఘం వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఆంజనేయులు



బాణసంచా కాలుస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు



దున్నపోతులతో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ తదితరులు

నేడు ముషీరాబాద్‌లో సదర్ వేడుకలు

ముషీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో శనివారం సదరు వేడుకలు నిర్వహిస్తున్నామని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్‌లో సదర్‌లో పాల్గొనే దున్నపోతులను ప్రదర్శించి విలేకరులతో మాట్లాడారు. సదర్ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ మంత్రులు తల సాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్‌అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాద వ్ తదితరులు హాజరవుతారన్నారు.

టీడీపీ పునర్ వైభవానికి కృషి చేయాలి

● పార్టీ శ్రేణులకు జంగం దశరథ్ పిలుపు

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్ వైభవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ పిలుపుని చ్చారు. శుక్రవారం ఆయన చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలంగాణలో పార్టీ పునర్ వైభవా నికి చర్యలు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారన్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీని పటిష్టం చేసేందుకుప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. 33 జిల్లాలకు పార్టీ అధ్యక్షులుగా బడుగు బలహీనవర్గాలనే నియమిం చేందుకు పార్టీ అధినేత కసరత్తు చేస్తున్నారని దశరథ్ తెలిపారు.

రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

హైదరాబాద్ డివిజనల్ రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్

బర్కత్‌పుర, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఎప్పటికప్పుడు తగిన ఏర్పాట్లు చేస్తూ ప్రయాణికుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు హైదరాబాద్ డివిజనల్ రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ కె. గోవిందరావు, కాచిగూడ స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. రైల్వే అధికారులు సిబ్బందితో కలిసి శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పండుగల సందర్భంగా సీజన్‌లలో ప్రయాణికుల రద్దీని ఎదుర్కొనేందుకు సిస్టమిక్ మేనేజ్‌మెంట్‌ను నిర్ధారించడానికి ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ప్రస్తుత దీపావళి, ఛట్ పూజ పండగ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ డివిజనల్ రైల్వే పరిధిలో ప్రయాణికుల రద్దీని సజావుగా, వ్యవస్థాగతంగా నిర్వహిం చేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్ర యాణికుల రద్దీకనుగుణంగా హైదరాబాద్ డివిజనల్‌లో ఆరు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌తోపాటు అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆర్‌పీ ఎఫ్, టికెట్ చెకింగ్ సిబ్బందిని పటిష్టం చేసినట్లు తెలిపా రు. జనరల్ కోచ్‌లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి క్యూలైన్లను అనుసరించేలా ఏర్పాట్లు చేశామ న్నారు. కాచిగూడ ఆర్‌పీఎఫ్ జీఎల్ మల్, సీసీఐ టి.రం గనాథ్, సీహెచ్ఐ అశ్వినికుమార్, సీటీఎస్ఆర్ చంద్ర మోహన్, సీఆర్ఐ రఫత్‌బేగ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు

● సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా

రాంనగర్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో బూత్, డివిజన్ స్థాయిలో సభ్యత్వం నిర్వహించి పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇటీవలనే ఇన్‌చార్జీల నియామకం జరిగిందని, వారి నాయకత్వంలో పార్టీ సభ్యత్వం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మికతను నింపిన త్రినాథరావు సంగీత విభావరి



త్రినాథరావును సన్మానిస్తున్న జస్టిస్ భవానీప్రసాద్, పార్వతీశం

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్బీఐ మాజీ ఏజీఎం, గాయకుడు చింతలపూడి త్రినాథరావు నిర్వహించిన భక్తి సంగీత విభావరి శ్రోతల్లో ఆధ్యాత్మికతను నింపింది. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో శ్రీ శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. త్రినాథరావు పలు భక్తి గీతాలను మధురంగా ఆలపించారు. సమావేశానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి. భవానీప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని త్రినాథరావుకు ఆత్మీయ సత్కారం నిర్వహించి భక్తిగాన సుధాకర బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సినీ నిర్మాత రామసత్యనారాయణ, దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ఆధ్యాత్మికవేత్త పూర్ణిమా కామేశ్వరరావు, కార్యక్రమ నిర్వహణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు చిల్లా శివపార్వతి, కార్యదర్శి చేపూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు అభినందనీయం

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం చేసిన పోరాటాలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు స్పందించారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల గురుకులాలు, హాస్టళ్లలో చదువుకునే 9 లక్షల 80 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాలేజీ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు రూ.1500 నుంచి రూ. 2100, గురుకులాల హాస్టల్‌లో 3 నుంచి 7వ తరగతి వరకు రూ. 950 నుంచి రూ. 1330 వరకు, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1400 నుంచి రూ. 1540 వరకు మెస్ చార్జీలు పెరిగాయని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, గొరిగే మల్లేష్‌యాదవ్, పి.సుధాకర్, నీల వెంకటేష్, జి.అనంతయ్య, ఉదయ్, రవియాదవ్, నందగోపాల్, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచంలోని ఏడు చానల్స్‌ను ఈదడమే లక్ష్యం

● దాతల సహకారం కోరుతున్నా.. ● అంతర్జాతీయ పిన్ స్విమ్మర్ గంధం క్వినివిక్టోరియా



బర్కత్‌పుర, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచలోని ప్రసిద్ధి చెందిన ఏడు ఛానల్స్‌ను ఈదడమే లక్ష్యంగా పెట్టుకున్నానని అంతర్జాతీయ పిన్ స్విమ్మర్ గంధం క్వినివిక్టోరియా తెలిపారు. ఇప్పటికే లండన్‌లోని ఇంగ్లీష్ చానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు నెలకొల్పానని, మిగతా చానల్స్‌ను కూడా ఈదుతానని ఆమె తెలిపారు. బర్కత్‌పురలోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ, అమెరికాలోని కివిఛానల్, క్యాస్టలిన చానల్, బ్రిటన్‌లోని నార్త్ చానల్, స్ట్రైట్ ఆఫ్ జిబ్రాల్టర్, జర్మనీలోని తుర్గాన్, న్యూజిల్యాండ్‌లోని కుక్‌స్ట్రైట్ ఛానల్స్ ప్రపంచ ప్రసిద్ధి చెందినవని, వీటిని ఈదడానికి ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగుతున్నానని అన్నారు. ఈ ఏడు చానల్స్‌ను ఈది ప్రపంచ రికార్డు సాధించడమే తన లక్ష్యమని, దాతలు సహకరించాలని ఆమె కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, తన నైపుణ్యాన్ని గుర్తించి సహకరిస్తే మరింత పట్టుదలతో ముందుకు సాగుతానని ఆమె తెలిపారు. అఫ్జల్‌గంజ్ పీఎస్ సీఐ జి.లింగేశ్వరరావు రూ. 25 వేలు, మహంకాళి పీఎస్ సీఐ ఆర్.పరుశరాం రూ. 20 వేలు ఆర్థిక సాయం చేశారని, వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాని ఆమె అన్నారు.

కవులందరిపై కృష్ణశాస్త్రి భావకవిత్వ ప్రభావం



నివాళులర్పిస్తున్న వంశీ రామరాజు, కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాటి కవులందరిపై దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవిత్వం ప్రభావం చూపిందని వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు అన్నారు. ఎందరో మహానుభావులు శీర్షికన త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో గానసభలో శుక్రవారం దేవులపల్లి కృష్ణశాస్త్రి సంస్మరణ సమావేశం జరిగింది. రామరాజు మాట్లాడుతూ చివరి రోజుల్లో కృష్ణశాస్త్రి గళం మూగపోయినా ఆయన కవిత్వం ధార మాత్రం మూగ పోలేదన్నారు. కేంద్రం కృష్ణశాస్త్రికి పద్మభూషణ్ ఇవ్వడం తెలుగు కవికి తొలిసారిగా దక్కిన గౌరవం అని అన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ, సులువైన పదాలతో గాఢమైన భావాన్ని చెప్పగల కృష్ణశాస్త్రి భావకవిత్వ సార్వభౌముడు అని అన్నారు. గానసభ పాలకమండలి సభ్యులు శ్రీలతవర్మ, సభ్యుడు శంకర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

● హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ



ఇంటర్వ్యూ

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం ఒక విజ్ఞాన భాండాగారమని, ప్రజలంతా గ్రంథాలయాలను వినియోగించుకోవాలని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ పొట్లూరు పద్మజ అన్నారు. సిటీసెంట్రల్ లైబ్రరీతో పాటు శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి చేసే దిశలో అనే ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి పొట్లూరు పద్మజ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు పాఠకుల కోసం...

ఆంధ్రజ్యోతి: నగరంలో ఎన్ని శాఖాగ్రంథాలయాలు ఉన్నాయి?

చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీతో కలిపి 82 శాఖాగ్రంథాలయాలున్నాయి. మొబైల్ గ్రంథాలయాలు ఇప్పుడు పనిచేయడంలేదు. అన్ని శాఖాగ్రంథాలయాల్లో కలిపి 256 ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 66 మంది సిబ్బంది, 40 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. 190 సిబ్బంది ఇంకా అవసరం ఉంది.

సిటీసెంట్రల్ లైబ్రరీలో తాగునీటి సౌకర్యానికి ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

పాఠకులతో పాటు ప్రతినిత్యం 2 వేల మంది పోటీ పరీక్షల అభ్యర్థులు లైబ్రరీలో చదువుకోవడానికి వస్తుంటారు. వారికి కనీసం 5 ప్రాంతాల్లో మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాం. పోటీ పరీక్షల సమయంలో దాదాపు ఐదు వేల మంది ప్రతినిత్యం లైబ్రరీకి వస్తుంటారు.

లైబ్రరీలో ఎన్ని భాషల పుస్తకాలు లభ్యమవుతాయి. ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

సిటీసెంట్రల్ లైబ్రరీతోపాటు మొత్తం 82 శాఖాగ్రంథాలయాల్లో 42లక్షల 43వేల 247 పుస్తకాలు ఉన్నాయి. పోటీ పరీక్షల అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను ఆన్ డిమాండ్‌పై తెప్పించి ఉంచాం

హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థలో ఎంతమంది సభ్యులున్నారు?

నగర కేంద్రగ్రంథాలయ సంస్థ పరిధిలో 87 వేల42 మందిసభ్యులున్నారు.

గ్రంథాయాలకు నూతన భవన నిర్మాణాలు జరుగుతున్నాయా?

మొత్తం 13 కొత్త గ్రంథాలయ భవనాలు, 33 భవనాలకు మరమ్మతులు 18 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి. నూతన భవనాలు మరో ఆరునెలల్లో అందుబాటులోకి వస్తాయి.

4వేల మంది కార్మికులకు గుర్తింపు కార్డులు

చిక్కడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జోన్ పరిధిలో మొత్తం 58వేల మంది కార్మికులను గుర్తించినట్లు జోన్ జాయింట్ లేబర్ కమిషనర్(జేసీఎల్) శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. గత ఆగస్టు 19 నుంచి దాదాపు రెండు నెలలపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ, 58 వేల మందిలో 49 వేల మంది వలస కార్మికులే నని మిగతా 9 వేల మంది భవన నిర్మాణ కార్మికులని తెలిపారు. వలస కార్మికుల్లో కూడా అత్యధికులు భవన నిర్మాణ రంగ కార్మికులే ఉన్నారని తెలిపారు. వీరిలో దాదాపు 4 వేల మందికి గుర్తింపు కార్డులు మంజూరు చేశామని, మిగతా వారికి కూడా ఇస్తామన్నారు.

పూజారిని విధుల నుంచి తొలగించాలి

● మాల కులాల యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు దయానంద్

ముషీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళను కులం పేరుతో అవమానపర్చిన పూజారిని విధుల నుంచి తొలగించాలని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్‌లోని వైఎస్ఆర్ పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పార్కు సమీపంలో సాయిబాబా, రాజరాజేశ్వరి ఆలయం పక్కనే దళిత హక్కుల రక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు మంగ నివాసం ఉంటూ ప్రతిరోజూ ఆలయంలో ధూప, దీప నైవేద్యాలు పెడుతూ స్వచ్ఛందంగా సేవలు చేస్తున్నదని తెలిపాడు. ఆలయ పూజారి చిట్టీల వ్యాపారం చేస్తుండటంతో ఆయనను ప్రశ్నించిన మంగను కులం పేరుతో దూషిస్తూ హారతి ఇవ్వను, ప్రసాదం పెట్టను అని అవమానపర్చాడని తెలిపారు. ఈ విషయంపై మంగ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు ఆగస్టులో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పూజారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖ స్పందించి పూజారిని విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ వయస్సుకే తప్ప సేవకు కాదు



గోవర్ధనాచారిని సన్మానిస్తున్న ఈడీఓ మునిశేఖర్

బర్కత్ పుర, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగికి తప్పదని, అది కేవలం వయస్సుకే తప్ప సేవా భావానికి కాదని ఆర్టీసీ ఈడీఓ మునిశేఖర్ అన్నారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్) గా ఉద్యోగ విరమణ చేసిన తొగిటి గోవర్ధనాచారిని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఏఓ గీత, ఏఓ పీవీ రంగారావు, విటోభా, సంధ్య, మగ్బుల్ పాషా, శోభన్‌బాబు, పద్మావతి, రమణ, నర్సయ్య, శీనప్ప, సుధాకర్, పి.రమేష్, రాజేష్, స్వరూప, లక్ష్మి, చంద్రకళ, పి.రమాదేవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసి ట్రాన్స్‌కోకు మంచిపేరు తీసుకురావాలి



ఏఏఓ యాదయ్య దంపతులను సన్మానిస్తున్న ట్రాన్స్‌కో సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డీఈ కమల్‌కుమార్ తదితరులు

రాంనగర్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మానవుడు జీవించాలంటే గాలి, నీరు ఎంతో అవసరం అని, నేడు ఆ రెండు కావాలంటే కరెంట్ తప్పని సరి అయిందని, అంత ప్రాముఖ్యత గల కరెంట్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ట్రాన్స్‌కో ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకోవాలని ట్రాన్స్‌కో సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న సూచించారు. ఆజామాబాద్ విద్యుత్ శాఖలో అకౌంట్ అసిస్టెంట్ అధికారి (ఏఏఓ) వి.యా దయ్య ఉద్యోగ విరమణ సమావేశం శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాన్స్‌కో సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డీఈ కమల్‌కుమార్‌లు హాజరై ఉద్యోగ విరమణ చేసిన వి.యాదయ్య దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు తమ్మయ్య, చంద్రుడు, ప్రవీణ్, ప్రభాక ర్, కరుణాకర్, రాజేష్, శ్రీకాంత్ సిబ్బంది వి.యాదయ్యను సత్కరించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు
అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

● బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్

రాంనగర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమత రాజ్య స్థాపన లక్ష్యంగా బ్లూ ఇండియా పార్టీ ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భూపాల్, ఉపాధ్యక్షుడు షేక్ అమినుద్దీన్, జాతీయ సమన్వయకర్తలు నగేష్, భూషణ్, సెంథాల్, అధికార ప్రతినిధి భూంపల్లి మధు, కార్యదర్శులు బానోతు లింగన్న, సుజాతగౌడ్ పాల్గొన్నారు.